క్లుప్తంగా

మహిళల కోసం 'సఖి'



జిల్లెలగూడలో సఖి పోలింగ్ స్టేషన్

మీర్‌పేట: రంగురంగుల బెలూన్‌లు... పచ్చతివాచీ... తోరణాలు.. ఇదేదో శుభకార్యం కోసం ఇంటిని అందంగా ముస్తాబు చేయడం కోసం కాదు. మహిళల ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం వినూత్నంగా ఏర్పాటు చేసిన సఖీ పోలింగ్ స్టేషన్. వివరాల్లోకి వెళితే. మీర్‌పేట కార్పొరేషన్ పరిధి జిల్లెలగూడ చల్లా లింగారెడ్డి ప్రభుత్వ పాఠశాలలో ప్రత్యేకంగా సఖి పోలింగ్ స్టేషన్ ఏర్పాటు చేశారు. ఓటింగ్ శాతం పెంచేందుకే ప్రత్యేకంగా తీర్చిదిద్దామని అధికారులు తెలిపారు. ఇక్కడ మహిళా సిబ్బందినే నియమించడం విశేషం.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న వేదపండితులు

హుడాకాంప్లెక్స్: శ్రీ హంపీ విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థ వారి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ డివిజన్ పరిధిలోని వేంకటేశ్వర కాలనీలోని వేంకటేశ్వర ఆలయం 39వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వర స్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. హంపీ పీఠాధిపతి శ్రీ విద్యారణ్య భారతీ స్వామి సమక్షంలో వేద పండితులు కృష్ణమాచార్యులు, వంశీధరచార్యులు, రామకృష్ణచార్యులు, శ్యాంసుందర్ వేదోచ్చారణాల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కోరుపోలు భాస్కర్‌రెడ్డి, కాలనీ అధ్యక్షుడు ధనంరెడ్డి, కోశాధికారి రమణ, సభ్యులు వేణుబాబు, సుబ్బారావు, మురళీ కౌండిన్య, శ్రీనివాసరావు, భోగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మైసమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కడ్తాల్: మండలంలోని మైసిగండి మైసమ్మ ఆలయ జాతర వైభవంగా కొనసాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ట్రస్టీ శిరోలీ, ఈఓ స్నేహలత ఏర్పాట్లను పర్యవేక్షించారు. భాస్కర్‌నాయక్, అరుణ్ కుమార్, ఆలయ అర్చక సిబ్బంది ఉన్నారు.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నేతల మధ్య వాగ్వివాదం

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఓ మహిళతో బీఆర్‌ఎస్ నేతలు దొంగ ఓటు వేయిస్తున్నారని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తూ వాగ్వివాదానికి దిగారు. ఈ నేపథ్యంలో ఇరు పార్టీ నేతల మధ్య వాదన చోటుచేసుకుంది. పట్టణంలోని క్రిస్టియన్ కాలనీలో ఏర్పాటు చేసిన 237 పోలింగ్ కేంద్రంలో భార్గవితో బీఆర్‌ఎస్‌నేతలు దొంగ ఓటు వేయిస్తున్నారనే కారణంతో కాంగ్రెస్ నేతలు వారితో వాదనకు దిగారు. ఈ విషయాన్ని గమనించిన పోలీసులు నేతలను సముదాయించి పంపించారు.

ఓటు గల్లంతు

కేశంపేట: అల్వాల గ్రామానికి చెందిన కాకునూర్ సాయమ్మ ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రానికి వెళ్లగా అక్కడ ఓటు లేదని అధికారులు తెలిపారు. దీంతో నిరాశగా ఆమె వెనుదిరిగింది. 40 సంవత్సరాలుగా తను ఓటు హక్కు వినియోగించుకుంటున్నానని తెలిపింది. అధికారుల నిర్లక్ష్యమో లేక బీఎల్‌ఓ నిర్లక్ష్యమో కాని తన ఓటు ఓటర్ లిస్టులో లేకుండా పోయిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

డీసీపీ సాయిశ్రీ

నాగోలు: ఎల్‌బీనగర్ జోన్ పరిధిలో అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయని ఎల్‌బీనగర్ డీసీపీ సాయిశ్రీ తెలిపారు. గురువారం సాక్షితో మాట్లాడుతూ, గురువారం ఉదయం నుంచి పోలింగ్ బూత్‌ల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. చెదురుమదురు ఘటనలు తప్ప ఎలాంటి గొడవలకు తావులేకుండా ఎన్నికలు ముగిశాయన్నారు. ఈవీఎంలను ఆయా కౌంటింగ్ కేంద్రాలకు పటిష్ట బందోబస్తు మధ్య తరలిస్తామన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ పర్యవేక్షణలో ఎల్‌బీనగర్ సీపీ క్యాంప్ కార్యాలయంలో నుంచి ప్రతి క్షణం ఎన్నికల సరళిని పరిశీలించామన్నారు. పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్ ఎల్‌బీనగర్ జోన్ పరిధిలోని పలు పోలీస్ కేంద్రాలకు వెళ్లి బందోబస్తును పరిశీలించారు.



మీర్‌పేటలో కుటుంబసభ్యులతో ఓటు వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



జిల్లెలగూడలో సతీమణి, కుమార్తెతో కలిసి ఓటు వేసిన డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి



సరస్వతిగూడలో ఓటేసిన జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి తదితరులు



జిల్లెలగూడలో ఓటేసిన మీర్‌పేట కార్పొరేషన్ మేయర్ దుర్గ

అంతా ప్రశాంతం

మీర్‌పేట: ఈ సారి అసెంబ్లీ ఎన్నికలు హోరాహోరీగా సాగాయి. చిన్నచిన్న ఘటనలు మినహా 119 స్థానాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. హైదరాబాద్ మినహా ఇతర జిల్లాల్లో పోలింగ్ శాతం పెరిగింది. ఈ సారి ముఖ్యంగా యువ ఓటర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రధాన పార్టీలు యువత, మహిళలే లక్ష్యంగా హామీలు గుప్పించారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య ముక్కోణపు పోటీలో వీరి ఓట్లు అధికారాన్ని డిసైడ్ చేయనున్నాయి. డిసెంబర్ 3న ఫలితాలు వెల్లడికానున్నాయి.



అగర్‌మియాగూడలో ఓటు వినియోగించుకున్న ఓటర్లు



మొదటిసారి ఓటేసిన అక్కాచెల్లెళ్లు



మీర్‌పేటలో ఓటేసిన కార్పొరేటర్లు పెండ్యాల నర్సింహ, శివపార్వతి



కొత్తగూడలో ఓటర్లతో కలిసిన బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీరాములు



జిల్లెలగూడలో ..



కొత్తగూడలో ఓటు హక్కు వినియోగించుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తదితరులు



శ్రీరాం కాలనీలో బారులు తీరిన ఓటర్లు



షాహిన్‌నగర్‌లో..



బాచుపల్లిలో...



రామచంద్రగూడలో తొలిసారి ఓటేసిన యువతులు



మహేశ్వరంలో ఓటు వేసి వేలిని చూపిస్తున్న వృద్ధురాలు

పోటెత్తిన ఓటరు

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గ అసెంబ్లీ స్థానానికి జరిగిన ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం పోలింగ్ మందకొడిగా సాగినా మధ్యాహ్నం తర్వాత పుంజుకుంది. నియోజకవర్గంలోని మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, సరూర్‌నగర్ మండలాల్లో మొత్తం 542 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు.

ఓటింగ్ సరళి ఇలా...

ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు 5 శాతం, 9 గంటల నుంచి 11 గంటల వరకు 12.83, 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 33.13, మధ్యాహ్నం 3 గంటల వరకు 39.47, 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు 55.33 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత ఓటు వేయడానికి క్యూలైన్లో ఉన్న ఓటర్లకు.. ఓటు వేసేందుకు రిటర్నింగ్ అధికారి అనుమతిచ్చారు. దీంతో రాత్రి 8 గంటల వరకు సమయం పట్టింది. నియోజకవర్గంలో మొత్తం 5,46,577 ఓట్లు ఉండగా 3,02365 ఓటును వినియోగించుకున్నారు. 55.33 శాతం పోలింగ్ నమోదయినట్లు అధికారులు తెలిపారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 55.09 శాతం పోలింగ్ నమోదయింది. ఎన్నికల నిర్వహణలో 3,200 మంది సిబ్బంది పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలం, మున్సిపల్, వార్డులలో ఎలాంటి ఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ప్రతి పోలింగ్ స్టేషన్ల పరిసరాల్లో 144 సెక్షన్ విధించారు. ఓటింగ్ సరళిని బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు సబితారెడ్డి, కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, అందెల శ్రీరాములు యాదవ్‌లు పరిశీలించారు.

ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

కందుకూరు: మండల పరిధిలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. జైత్వారం 474 బూత్‌లో ఈవీఎం ఒక గంట సేపు మొరాయించింది. లేమూరు 509 బూత్‌లో ఈవీఎంలో సాంకేతికత కారణంగా అర గంటపాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. బేగంపేట 503 బూత్, మీర్‌ఖాన్‌పేట 488 బూత్‌లో కూడా అదే పరిస్థితి నెలకొంది. నేదునూరులో ఏర్పాటు చేసిన ఆరో పోలింగ్ బూత్‌లో రద్దీ వలన వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేసేందుకు అవస్థలు పడ్డారు. గూడూరు, కందుకూరు పోలింగ్ బూత్‌లను మంత్రి సబితారెడ్డి సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు. కొత్తగూడతో పాటు పలు గ్రామాల్లోని బూత్‌లను బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి అందెల శ్రీరాములుయాదవ్, రాచులూరు పోలింగ్ స్టేషన్‌ను అడిషనల్ ఎస్పీ గంగారెడ్డి పరిశీలించారు. సరస్వతిగూడలో జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, కొత్తగూడలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాగా మండలంలో 5 గంటల వరకు 53.14 శాతం ఓటింగ్ నమోదైంది. ఆ తర్వాత నేదునూరు, లేమూరు, మురళీనగర్, చిప్పలపల్లి, మీర్‌ఖాన్‌పేట, బేగంపేట, ఊట్లపల్లి తదితర గ్రామాల్లో ఓటింగ్ కొనసాగింది.

తుక్కుగూడలో..

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఓటు వేయడానికి, ఓటర్లు ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ రాత్రి 7 గంటలకు ముగిసింది.

మొరాయించిన ఈవీఎం

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ డివిజన్ పరిధి లక్ష్మీనగర్ కాలనీలోని బూత్ నంబర్ 45లో సన్‌రిడ్జ్ స్కూల్‌లో ఓటింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే ఈవీఎం మొరాయించడంతో ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. టెక్నికల్ సిబ్బంది సకాలంలో సరిచేయడంతో పోలింగ్ కొనసాగింది.

జల్‌పల్లి మున్సిపాలిటీలో

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలో అసెంబ్లీ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పహాడీషరీఫ్‌లో ఒక ఈవీఎం గంట పాటు మొరాయించింది. శ్రీరాం కాలనీ, జల్‌పల్లి, షాహిన్‌నగర్ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మధ్య చిన్నపాటి ఘర్షణలు చోటు చేసుకున్నాయి.



మన్సాన్‌పల్లిలో ఓటు వేయడానికి వీల్ చైర్‌పై వృద్ధుడిని తీసుకెళ్తున్న ఎన్నికల సిబ్బంది



అమీర్‌పేట్ గ్రామంలో ఓటేసేందుకు క్యూ లైన్‌లో నిలబడ్డ ఓటర్లు



మీర్‌ఖాన్‌పేట: ఓటు వేయడానికి క్యూలో నిలబడ్డ ఓటర్లు



మహేశ్వరంలో ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు

యువతరం.. నవ వసంతం

మీర్‌పేట: ఓటు హక్కు అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతి ఒక్కరూ నిర్భయంగా ఓటు వినియోగించుకొన్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుంది. ఓటు హక్కు ఎంతో ప్రవిత్రమైనది.. పరిపాలన విధానానికి ఆయుధం లాంటిది. దీన్ని గుర్తించిన యువ ఓటర్లు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొదటిసారి ఓటేసిన వీరు ఉబ్బితబ్బిబయ్యారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్లలో నిల్చొని ఓటేశారు.

ఉత్సాహంగా ఉంది



మొదటిసారి ఓటింగ్‌లో పాల్గొనడం, ప్రజాస్వామ్యంలో భాగం కావడం ఉత్సాహంగా ఉంది. ఓటు ద్వారా ఉత్తమమైన పాలకులను ఎన్నుకోవచ్చు. భవిష్యత్తులోనూ ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి.

– రితిక, జిల్లెలగూడ

యువతకు ఉపాధి పెంచాలి



మొదటిసారి ఓటు వేశాను. రాష్ట్రంలో నిరుద్యోగం పెరిగిపోయి యువత ఇబ్బందులు పడుతున్నారు. ఫలితాలు వెలువడి గెలిచిన పార్టీ.. ప్రభుత్వం ఏర్పాటు చేశాక యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకోవాలి.

నితిన్, మీర్‌పేట

ఓటు హక్కు ఎంతో విలువైంది



ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైంది. తొలిసారి ఓటు వేయడం సంతోషంగా ఉంది. యువత అసెంబ్లీతో పాటు స్థానిక సంస్థల్లోనూ ఓటు తప్పనిసరిగా వేయాలి.

–రిషిక, బాలాపూర్ ఎక్స్‌రోడ్డు

టెన్షన్ ఫీల్ అయ్యాను



ఓటు వేసేటప్పుడు టెన్షన్ ఫీల్ అయ్యాను. సేవ చేసే అభ్యర్థికి ఓటు వేశాను. విద్యావంతులు రాజకీయాల్లో ఉండాలి. ప్రజల అవసరాలు గుర్తించి, వారి సమస్యలు తీర్చే వ్యక్తి ఎమ్మెల్యేగా గెలుపొందాలి.

– సంతోషి, సరూర్‌నగర్

నిర్భయంగా ఓటు వేయాలి



నేను మొదటి సారిగా ఓటు వేస్తున్నాను. ఓటు హక్కు అనేది మనకు రాజ్యాంగం కల్పించిన హక్కు. ప్రతి ఒక్కరూ ప్రలోభాలకు గురికాకుండా నిర్భయంగా ఓటు వేయాలి

నిఖిత, రావిర్యాల

భవిష్యత్ కల్పించే వారికి నా ఓటు

ఎన్నికల్లో చాలా మంది రాజకీయ నాయకులు ఆయా పార్టీల నుంచి పోటీ చేస్తారు. కానీ మన సమస్యలను పరిష్కరించే వారికి, భవిష్యత్‌కు భరోసా కల్పించే వారికే ఓటు వేయాలి. గెలిచిన వారు ప్రజా సమస్యలను పరిష్కరించాలి.

– వంశీ, రావిర్యాల

మొరాయించిన ఈవీఎం

మాడ్గుల: మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లిలో గురువారం జరిగిన పోలింగ్‌లో ఈవీఎంలు మొరాయించడంతో సుమారు రెండుగంటల పాటు పోలింగ్ నిలిచిపోయింది. గ్రామంలో ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమవ్వగా.. తొమ్మిదిగంట ప్రాంతంలో ఈవీఎం మొరాయించింది. టెక్నీషియన్లు వచ్చి రెండు గంటలు శ్రమించి ఈవీఎం మెషీన్‌ను బాగు చేశారు. 11 గంటల తర్వాత పోలింగ్ ప్రారంభమైంది

యాచారంలో

యాచారం: మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. యాచారం, మొండిగౌరెల్లి, మంతన్‌గౌరెల్లి తదితర గ్రామాల్లో ఉదయం ఈవీఎంలు మొరాయించడంతో కొద్ది సేపు ఓటింగ్ నిలిచిపోయింది. సాంకేతిక సిబ్బంది వచ్చి మరమ్మతులు చేయడంతో మళ్లీ పోలింగ్ కొనసాగింది. నందివనపర్తిలో 32 బూత్‌లో ఈవీఎంలు సక్రమంగా పని చేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. టెక్నీషియన్లు వాటిని సరిచేయడంతో ఓటింగ్‌ను పునఃప్రారంభించారు.



పోలింగ్ కేంద్రం వద్ద కూర్చున్న మహిళలు